www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 7 సెప్టెంబర్ 2024

5

అన్నమయ్య

ఎమ్మెల్యే 'ఆదిమూలం'ను అరెస్టు చేయాలి

- ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ డిమాండ్

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కన్వీనర్ ఎం. భాగ్యమ్మ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తన గెలుపు కోసం కష్టపడి పనిచేసిన మహిళపై అత్యాచారానికి ఒడి కట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రభుత్వం వెంటనే చర్య తీసుకుని ఇలాంటి ఎమ్మెల్యేను బర్తరఫ్ చేసి బాధిత మహిళకు రక్షణ కల్పించాలన్నారు. ప్రజాప్రతినిధులుగా అధికార పార్టీలో ఇలాంటి నీచమైన పనులు చేయడాన్ని సిగ్గుచేటుగా అభివర్ణించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సభ్యులు ఎస్. రెడ్డి ప్రసన్న, ఎం గాయత్రి, రేవతి, పి భాను, జి జానకి ఉన్నారు.

ప్రాజెక్టుల భద్రత ఎంత!

రిటైర్మెంట్లతో ఇఇ పోస్టులు ఖాళీ

ఇఇలపై అదనపు భారం తథ్యం

ఆందోళనలో నీటిపారుదల శాఖ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్రం వైపు మరో తుపాన్ రానున్న నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది. నీటిపారుదల శాఖ ఆందోళనకు గురవుతోంది. గత నెల 31న ఐదుగురు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రిటైర్మెంట్ కావడం, మిగిలిన ఇఇలు ఎఫ్‌ఎసిల కోసం ఇతర జిల్లాలకు వెళ్లాలనే ప్రయత్నాలు చేసుకుంటున్న సంగతి తెలి సిందే. రాష్ట్రంలో వరుస తుఫాన్లు, వరద ప్రభావాల నేపథ్యంలో జిల్లా నీటి పారుదలశాఖ ఉలికిపాటుకు గురైంది. 2021లో అన్నమయ్య రిజర్వాయర్ గల్లంతును తలుచుకుని గగుర్పాటుకు గురవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. జిల్లా నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం శరవేగంగా కదలింది. జిల్లాకు చెందిన ఐదుగురు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు జిల్లా పరిధిలోని రిజర్వాయర్ల పర్యవేక్షణ నిమిత్తం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈలెక్కన ఒక్కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రెండు రిజర్వాయర్ల భద్రతకు బాధ్యత వహించాల్సి రావడం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలోని 13 చిన్న, మధ్య, భారీ తరహా ప్రాజెక్టులు ఉన్నాయి. బ్రహ్మసాగర్, సర్వ రాయసాగర్ ప్రాజెక్టులు లీకేజీ సమస్యలతో సత మతం అవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఆయా రిజర్వాయర్ల లీకేజీ సమస్య పరిష్కారానికి రాష్ట్ర స్థాయి నిపుణుల పరిశీలించినప్పటికీ పరిష్కారానికి నోచని సంగతి తెలిసిందే. మిగిలిన రిజర్వాయర్లలో మైలవరం, పిబిఆర్, లోయర్ సగిలేరు కట్టలు మరమ్మతులు గురైన నేపథ్యం ఇరిగేషన్ ఇంజినీర్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్న నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది. లీకేజీ సమస్యలను ఎదుర్కొంటున్న రిజర్వాయర్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రిటైర్మెంట్ కావడం, కొత్తగా ఐదుగురు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు లీకేజీ సమస్యలు ఉన్న ప్రాజెక్టుల పర్యవేక్షణకు అదనపు బాధ్యతలు తీసుకోవడానికి తట పటాయిస్తున్న వైనం ఆందోళన కలిగిస్తోంది.

తెలుగుగంగ డివిజన్ ఎగిక్యూటివ్ ఇంజినీర్ రాజన్నాయుడు ఇటీవల రిటైరైన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో కన్‌స్ట్రక్షన్ సర్కిల్-3 చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాధాకృష్ణారెడ్డిని నియమించింది. రిటైరైన వాటర్ క్వాలిటీ రిసర్చ్ ల్యాబ్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.పురుషోత్తం స్థానంలో జిఎన్‌ఎస్‌ఎస్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.వి.సాయిరాంప్రసాద్‌కు అదనపు బాధ్యతల్ని అప్పగించింది. ఆర్‌డబ్ల్యుఎం డివిజన్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.కుమారస్వామి స్థానంలో జిఎన్‌ఎస్‌ఎస్ డివిజన్ నెంబర్-5 చెందిన ఎస్.చిన్నరామునాయక్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇటీవల రిటైరైన వాటర్ క్వాలిటీ రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.పురుషోత్తం స్థానంలో టిబిపి హెచ్‌ఎల్‌సి సర్కిల్ అనంతపురం పరిధిలోని ఎం.వి.డ్యామ్ పర్యవేక్షణ బాధ్యతల్ని పులివెందుల డివిజన్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యు.రమేష్‌కు అప్పగించింది. ఇటీవలే రిటైరైన చీఫ్ ఇంజినీర్ కోస్టల్ రీజియన్‌కు క్వాలిటీ కంట్రోల్ విభాగానికి చెందిన దవలేశ్వరం బాధ్యతల్ని చూస్తున్న డి.కిరణ్‌కుమార్ స్థానంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.వి.శేషుబాబుకు అదనపు బాధ్యతల్ని అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సదరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఆగమేఘాల మీద అప్పగించిన బాధ్యతల్ని చేపట్టాలని ఆదేశించడం గమనార్హం.

ప్రజలకు ఉచితంగా ఇసుక

- లోడింగ్ కోసం ఒక టన్నుకు మొత్తం రూ.328 మాత్రమే చెల్లించాలి

- రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

మీడియాతో మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇసుక పూర్తిగా ఉచితంగా ఇవ్వనున్నామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఉచిత ఇసుక విధానంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల్లోని ప్రజలకు మూడు రీచుల ద్వారా 5.15 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాజంపేట మండలం చేయేరు నది వద్ద బోడు కుంటపల్లిలో మూడు ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇసుక అవసరమైన ప్రజలందరూ ఈ రీచ్ ల ద్వారా ఉచితంగా ఇసుక పొందవచ్చు అన్నారు. ఇసుక బుకింగ్ నిమిత్తం రాయచోటి, మదనపల్లి, తంబళ్ళపల్లి, పీలేరు నియోజకవర్గాల వినియోగదారులకు సానిపాయ సచివాలయంలో, రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాల వినియోగదారులకు కూచువారిపల్లి గ్రామ సచివాలయాలలో బుకింగ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఎవ్వరికి ఇసుక కావాలన్నా డీజిల్లేషన్ పాయింట్‌కు వెళ్లి ఇసుక పొందవచ్చునన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించిన ప్రకారం ప్రజలకు ఇసుక పూర్తిగా ఉచితం ఒక్క రూపాయి కూడా వినియోగదారుడు ఇసుకకు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కేవలం నిర్వహణ, రవాణా చార్జీలు మాత్రమే చెల్లించాలని చెప్పారు. ఒక టన్నుకు మొత్తం రూ.328లు లోడింగ్ కోసం నిర్వహణ చార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర జిల్లాలతో పోల్చితే అన్నమయ్య జిల్లాలో రవాణా ఖర్చులు చాలా తక్కువన్నారు. మిషన్లు, యంత్రాలు లేకుండా ఎద్దుల బండిలో ఎంత ఇసుకైనా ఉచితంగా తీసుకెళ్ల వచ్చునన్నారు. ప్రజలెవరు బ్లాక్‌లో ఇసుకను కొనుగోలు చేయవద్దని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కడా ఒక రూపాయి కూడా ఎక్కువ చెల్లించలేదన్నారు .హౌసింగ్ కానీ, ఇతరత్రా ప్రభుత్వ అభివృద్ధి పథకాలకు సంబంధించి చేసే పనులకు కూడా ఇసుక అందుబాటులో ఉంటుందని ప్రజలందరూ అవసరం మేరకు ఉచిత ఇసుకను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో తెలుగు రాష్ట్రాలలో రాజధాని ప్రాంతాలలో ప్రతి ఎక్కువగా వర్షాలు కురు సాయన్నారు. దీంతో అక్కడ ప్రజలు ఇబ్బందులు గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రివర్గం, ప్రజా ప్రతినిధులు, అధికారులు అక్కడ ఉన్న ప్రజలకు సేవలు చేసి ప్రజలకు భరోసా కల్పించామన్నారు. అక్కడ ప్రజలకు అంత భరోసా కల్పించినా వైసిపి నాయకులు సోషల్ మీడియాలో విమర్శించడం సరికాదన్నారు. సమావేశంలో తంబళ్లపల్లె టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ జయ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

పునరావాస పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ శ్రీధర్ చామకూరి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మంగంపేట ఆర్‌అండ్‌ఆర్ 5వ ప్యాకేజీ సహాయ పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. మండలంలోని మంగంపేటలో సహాయ పునరావాసం నిమిత్తం ఆర్అండ్ఆర్ 5వ ప్యాకేజీలో కాపుపల్లి, హరిజనవాడ, అరుంధతివాడలలో నిర్వహిస్తున్న మౌలిక వసతుల పనులు, అభివృద్ధి కార్యక్రమాలు, భూసేకరణ అంశాలపై శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్అండ్ఆర్ - ఐదులో రహదారుల ఏర్పాటు, విద్యుత్ సబ్ స్టేషన్, పోల్స్, లైన్ల ఏర్పాటు, తాగునీటి సరఫరా కోసం బోర్లు, పైప్ లైన్, నీటి కనెక్షన్లు, కాలువల ఏర్పాటు నిమిత్తం చేపట్టిన పనులు ఎంత వరకు పూర్తి అయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం, శ్మశావాటికల ఏర్పాటు షాపింగ్ కాంప్లెక్స్‌కు, ప్లేగ్రౌండ్, పార్క్ అండ్ గ్రీనరీ, ఆలయాల నిర్మాణం, ఎంట్రన్స్ ఆర్చ్ తదితరాలలో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతి, ఎంత శాతం పనులు పూర్తి చేశారు. ఇంకా ఎంత పూర్తి చేయాల్సి ఉంది, తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి, సమస్యలు ఏమైనా ఉన్నాయా తదితర అంశాలలో జిల్లా అధికారులు, ఎపిఎండిసి అధికారులను ప్రశ్నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్ అండ్ బి శాఖ ద్వారా కాపుపల్లి, హరిజనవాడ, అరుంధతి వాడలకు సంబంధించి ప్రధాన, అంతర్గత రహదారుల నిర్మాణం 90 శాతం పూర్తయిందని, మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. అక్కడ ఒక ఒసి, ఎస్‌సి కమ్యూనిటీ హాళ్లు మంజూరయ్యాయని, ఇందుకు సంబంధించి 15 రోజుల్లోగా సంపూర్తి ప్రతిపాదనలు సమర్పించాలని ఆర్‌అండ్‌బి శాఖను ఆదేశించారు. విద్యుత్ శాఖకు సంబంధించి సబ్ స్టేషన్ పనులు 20 శాతం పూర్తి చేశారని, పోల్స్, లైన్ల ఏర్పాటు పనులు ప్రగతిలో ఉన్నాయన్నారు. రెండు నెలల్లోగా వంద శాతం పనులు పూర్తి చేయాలని విద్యుత్ శాఖకు సూచించారు. నీటి సరఫరా కోసం 15 రోజుల్లోగా నీటి పైప్ లైన్లు, కనెక్షన్స్, బోర్ వెల్స్ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రం, డిజిటల్ లైబ్రరీ, ప్లే గ్రౌండ్, యూత్ సెంటర్, పార్క్ అండ్ గ్రీనరీ ఏర్పాటు పనులను వంద రోజుల్లోగా పూర్తి చేయాలని, ఇందుకు సంబంధించిన పనులను వెంటనే మొదలు పెట్టాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత ఆలయ నిర్మాణాలకు సంబంధించి గ్రామ పెద్దలు, గ్రామ కమిటీలను సంప్రదించి వారి అభీష్టం మేరకు ఆలయాలు నిర్మించేందుకు ఒక వారంలోగా చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు త్వరితగతిన పనులను చేపట్టి నిర్దేశిత కాల పరిమితిలోగా పూర్తి చేయాలని, ఇందులో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే సబ్ కలెక్టర్ దృష్టికి లేదా తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు చెప్పారు. అనంతరం వివిధ అంశాలలో పలు సూచనలు జారీ చేశారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నైదియ దేవి, ఎపి ఎండిసి సిపిఓ సుదర్శన్ రెడ్డి, తహశీల్దార్ పీర్ మున్ని, ఆర్‌అండ్‌బి, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, హౌసింగ్, తదితర శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

గ్రీన్ హార్ట్ సంస్థ సేవలు అభినందనీయం

-ఎమ్మెల్యే షాజహాన్ బాషా

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మదనపల్లె గ్రీన్ హార్ట్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా హాజరయ్యారు. ఇందులో భాగంగా 200 పైగా మట్టి వినాయక విగ్ర హాలు, మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, మత సామరస్యానికి నిదర్శనంగా నిర్వహించుకునే వినాయక చవితి పండుగ ప్రతి కుటుంబంలోనూ సంతోషాన్ని నింపాలని ఆకాక్షించారు. అనంతరం గ్రీన్ హార్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రకృతి హితం కోసం మట్టి వినాయకుడిని, పూజించి పర్యావరణాన్ని రక్షిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుత్తికొండ త్యాగరాజు, యర్రబల్లి వెంకటరమణా రెడ్డి, బిల్డర్ తమ్మిశెట్టి రామకృష్ణ, కోన భాస్కర్, బొమ్మిశెట్టి పురుషోత్తం, ఆదెప్ప, రెడ్డి రాయల్, సిద్ధార్థ, ప్రభాకర్, కట్ట లక్ష్మీనారాయణ,నారాయణ స్వామి, చలపతి, రాటకొండ శ్రీనివాస నాయుడు, గిరి, ఎన్95 అధినేత నక్కింటి మోహన, మైసూర్ శ్రీనివాసులు యాదవ్, రామిశెట్టి (కమలామ్రరి) కృష్ణ, జి.వి.నాయుడు,వేల్పుల వెంకటేష్, రేపన నాగరాజు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-సుండుపల్లి

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కెజిబివి ఆదర్శ పాఠశాలను సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలను నిర్వహిస్తున్న తీరుపై ఉపాధ్యాయులు, విద్యార్థులను తెలుసుకున్నారు. పాఠశాలలో ఎంతమంది విదార్థులు ఉన్నారు, అమలు చేస్తున్న మెనూ ప్రకారం భోజనం అందు తుందా లేదా, మౌలిక వసతులపై ఆరా తీవారు. విద్యార్థినులతో మమేకమై వారితోపాటు కింద కూర్చుని పలు అంశాలలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో ముగిసిన వర్క్‌షాపు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య యూనివర్సిటీలో శుక్రవారం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్ పై మూడు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రైనర్లు స్కైడ్ టెక్నాలజీస్ నుంచి స్నేహలతా రెడ్డి, దినేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు డేటా సైన్స్, మిషన్ లర్నింగ్ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రస్తుత తరుణంలో ఎలా అభివృద్ధి చెందుతుందో క్లుప్తంగా వివరించారు. అలాగే డేటా సైన్స్ తో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ టూల్స్‌ను ఉపయోగించి విద్యార్థులచేత చేయించారు. ఈ సదస్సులో వ్యవసాయంలో మొక్కల ఆరోగ్యం, వాతావరణం, డిజిటల్ సమాచారం నిర్వహణ, బ్యాంకింగ్ అప్లికేషన్, డేటా స్టోరేజ్ వంటి అనువర్తనాలు ద్వారా ఎలా అభివృద్ధి చేయాలో వివరించారు. కార్యక్రమంలో అన్నమాచార్య యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎన్.మల్లికార్జున రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, సియస్‌ఇ హెచ్‌ఓడీ డాక్టర్ యమ్ సుబ్బారావు, కో-ఆర్డినేటర్ బి.నవీన్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సదస్సులో ప్రసంగిస్తున్న వక్తలు

ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న హెచ్‌ఎం

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి - రాయచోటి

సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు పనిచేస్తున్న నిమ్మనపల్లి దేవప్రసాదరెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం పొందిన సందర్భంగా శుక్రవారం ఉదయం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ గురుపూజోత్సవం సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్ నాథరెడ్డి, డిఇఒ శివప్రకాశ్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అందుకోవడం గొప్ప విషయం అన్నారు. ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రస్తుత ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు నైతిక విలువలు , సామాజిక స్పృహ, శాస్త్రీయత గురించి నేర్పించాలన్నారు. నిరంతరం పాఠశాల అభివృద్ధికి పాటుపడడమే కాకుండా సమయపాలన పాటించడంలో, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో దేవప్రసాద్‌రెడ్డి ముందంజలో ఉన్నారన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు దేవప్రసాదరెడ్డిని పూల మాలలతోనూ, దుశ్శాలువులతోనూ, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలు పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

'మిట్స్'లో విగ్రహాల తయారీ పోటీలు

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ సోషల్ రెస్పాన్సిబుల్ క్లబ్ వారు కళాశాలలో వినాయక మట్టి విగ్రహ తయారీ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా మట్టి విగ్రహ తయారీ పోటీల్లో పాల్గొని తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ యువరాజ్ మాట్లాడుతూ వినాయక చవితి వచ్చిందంటే వీధులు, వాడలు అన్నీ గణేష్ మండపాలతో నిండిపోతుందన్నారు. అందరూ మట్టితో తయారు చేసిన విగ్రహాలు ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. విద్యార్థులు తయారుచేసిన మట్టి విగ్రహాలను పరిశీలించి బహుమతులను వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కమల్ బాషా అందించారు. కార్యక్రమంలో కళాశాల ఎం.ఎస్.ఆర్ క్లబ్ కో - ఆర్డినేటర్ షాఈజ్ అహమ్మద్, మ్యాథ్స్ విభాగాధిపతి డాక్టర్ రమేష్ రెడ్డి, ఇంగ్లీష్ విభాగాధిపతి డాక్టర్ సమీనా, ట్రిపుల్ విభాగాధిపతి డాక్టర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

కుంగిన భూమిని పరిశీలించిన వైవీయూ విద్యార్థులు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం జియాలజీ, ఎర్త్ సైన్స్ అధ్యాపకులు విద్యార్థులు దువ్వూరు మండలం రామాపురం వ్యవసాయ భూమిని సందర్శించారు. రైతు మానుకొండ వెంకట శివ వ్యవసాయ భూమిలో సుమారుగా 15 అడుగుల లోతు మేర భూమి కుంగిపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. కారణాలను శాస్త్రీయంగా అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా జియాలజీ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ సున్నపు రాతి పొరలు భూగర్భంలో జరిపిన చర్య ఫలితంగా భూమి కుంగిపోయిందని గుర్తించామన్నారు. ఐదేళ్ల కిందట కూడా ఇదే ప్రాంత సమీపంలో సింక్ హోల్స్ ఏర్పడినట్లు కనుగొన్నామన్నారు. భవిష్యత్తులోనూ ఈ ప్రాంతంలోని భూమిలో సింక్ హోల్స్ ఏర్పడడానికి అవకాశం ఉందని తెలిపారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి సమీపంలోని పుంగనూరు రోడ్డులో ఉన్న ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన అధ్యాపకులు బి. జలజ కుమారికి గౌరవ డాక్టరేట్ లభించిందని డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేట్ ప్రొఫెసర్ ఉన్న జలజ కుమారి 'అడ్వాన్స్‌మెంట్ ఇన్ డాక్యుమెంట్ సిమిలేటరీ మెజర్మెంట్, వెబ్ డాక్యుమెంట్ డెస్టినింగ్ అండ్ సెంటిమెంట్ అనాలసిస్ ఫర్ రీజినల్ లాంగ్వేజ్ డాక్యుమెంట్ ఏ కేస్ స్టడీ ఇన్ తెలుగు' అనే అంశంపై రీసెర్చ్ చేసి కృషి చేసినందుకు గాను జెఎన్‌టియు కాకినాడ వారు ఈ నెల 2న పిహెచ్ డి డిగ్రీ, గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్. ఎస్. రామలింగరెడ్డి, ప్రెసిడెంట్ ఎన్. నాగమల్లా రెడ్డి, చైర్మన్, ఆర్ .రామ్మోహన్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు డాక్టరేట్ అవార్డు గ్రహీత బి. జలజ కుమారిని అభినందించారు.

హెచ్‌ఐవి, ఎయిడ్స్‌ను నియంత్రించాలి

ప్రజాశక్తి-పీలేరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ సూచనల మేరకు హెచ్‌ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కోర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పీలేరు మండలం, దొడ్డిపల్లి పంచాయతీ, దారంవారిపల్లి అంగన్వాడీ కేంద్రంలో డ్వాక్రా మహిళలకు 'మీకు తెలుసా' హెచ్‌ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవి, ఎయిడ్స్ ఎలా వస్తుంది, ఎలా రాదు, హెచ్‌ఐవి స్థితిని ప్రారంభంలోనే తెలుసుకుని జాగ్రత్త తీసుకోక పోతే ఎయిడ్స్ దశకు చేరే అవకాశం ఉందని, హెచ్‌ఐవి వ్యాధి సోకిన వారిపట్ల వివక్ష చూపరాదని, హెచ్‌ఐవి, ఎయిడ్స్, క్షయ, సుఖవాధులను నియంత్రించడంలో కండోమ్ ముఖ్య పాత్ర పోషిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘమిత్ర సుగుణ, అంగన్వాడీ కార్యకర్తలు కె.రాజమ్మ, కె. రెడ్డి రాణి, ఎస్. షర్మిల పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్ : కురబలకోట మండలం, అంగళ్లు బస్టాండ్ సర్కిల్‌లో అన్నక్యాంటీన్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. అంగళ్లులో పోలీస్ అవుట్ పోస్ట్, జిల్లా సహకార బ్యాంకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ప్రభుత్వస్థలం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం అ స్థలం ఆక్రమణకు గురైందని, ఆ స్థలాన్ని ఖాళీ చేయించి పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. నిత్యం కూలీ లతో కిక్కిరిసే టమోటా మార్కెటుకు అందుబాటులో అంగళ్ళు బస్టాండులో ఏర్పాటు చేస్తే ప్రయా ణికులకు, కూలీలకు, రైతులకు, చిరు వ్యాపారులకు మేలు జరుగుతుందని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ మరియు వినాయకచవితి శుభాకాంక్షలు

44వ వార్షికోత్సవం

శ్రమజీవుల మానస పుత్రిక, కార్మిక, కర్షక, ఉద్యోగుల అభిమాన పత్రిక ప్రజాశక్తి
నిజాన్ని నిర్భయంగా రాస్తూ, ప్రజల పక్షాన నిలిచి
నేడు 44వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంగా
పాఠకులకు, సిబ్బందికి, విలేకరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు

ప్రజాశక్తి అభిమాని
పీలేరు.

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ మరియు వినాయకచవితి శుభాకాంక్షలు

44వ వార్షికోత్సవం

BSNL
Connecting India

" ప్రతి అక్షరం- ప్రజల పక్షం " అన్న నినాదంతో నిజాలను
నిర్భయంగా వ్రాస్తూ, కార్మికులు, కర్షకులు, ప్రజల పక్షాన నిలబడి వారికి
అండగా నిలుస్తున్న ప్రజాశక్తి తెలుగు దినపత్రిక 43 సంవత్సరాలు
దిగ్విజయంగా పూర్తి చేసుకొని నేడు 44 వ వార్షికోత్సవం జరుపుకుంటున్న
శుభ సందర్భంగా 'ప్రజాశక్తి' యాజమాన్యానికి,సిబ్బందికి, రిపోర్టర్లకు, పాఠకులకు,
అభిమానులకు ఇవే మా హార్థిక శుభాకాంక్షలు.

జె. శ్రీనివాసులు, ఎస్.డి.ఇ.
ఎస్. మున్నీర్ అమ్మద్, జె.టి.ఓ., టి.ప్రభాకర్, జె.టి.ఓ.,
బి.ఎస్.ఎన్.ఎల్. కార్యాలయం, పీలేరు.

వరద సహాయక చర్యల్లో కమిషనర్ మనోహర్

వరద బాధితులను ఆదుకుందాం: కమిషనర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన విజయవాడ వరద బాధితులను ఆదుకుందామని కమిషనర్ పి.ఆర్. మనోహర్ పేర్కొన్నారు. కమిషనర్ పి.ఆర్ మనోహర్, ఆర్ఓ శ్రీనివాసులు, వార్డ్ టౌన్ ప్లానింగ్ సెక్రెటరీ సందీప్‌లు ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం విజయవాడలో వరద సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారీ వర్షాల ధాటికి విజయవాడ నగరంతోపాటు చుట్టూ ప్రక్కల గ్రామాలలో హృదయ విదారక పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. సర్వం కోల్పోయి చాలా మంది ప్రజలు రోడ్డున పడ్డారని, ఆ సంఘటనలు తమను కలచివేసిందన్నారు. బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-గాలివీడు

మానవత సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మానవత సంస్థ అధ్యక్షుడు సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సర్తాజ్

సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-కలికిరి

సమతుల్యమైన ఆహారంతోనే పిల్లలు, తల్లులు ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సర్తాజ్ పేర్కొన్నారు. పోషణ మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం మేడుకుర్తి పిహెచ్‌సిలోని గుండ్లూరు గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారం పట్ల పిల్లలు, తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత గురించి, చేతులు శుభ్రత గురించి వివరించారు. ఐరన్, క్యాల్షియం ఉండే ఆహార పదార్థాలు పాలు, గుడ్డు, తాజా కూరగాయలు, పండ్లు, మాంసము ఎక్కువగా తీసుకోవాలని, రక్తహీనత లేకుండా సమతుల్య ఆహారం తీసుకుని వ్యాధులు బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు,తల్లులు పాల్గొన్నారు.

11న ఐటిఐలో జాబ్ మేళా

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక టిఎన్.వెంకట సుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి బి. హరికృష్ణరావు, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాను ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బి.టెక్, డిప్లొమా, ఎంబిఎ, పీజీ విభాగాలకు చెందిన, 18 నుంచి 35 సంవత్సరాలు వయసు గల నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్‌మేళాకు హాజరయ్యే యువత బయోడేటా, విద్యార్హత సర్టిఫికేట్లు, జిరాక్స్, ఆధార్, పాస్‌పోర్ట్ ఫోటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. 11న ఉదయం 10 నుంచి తంబళ్లపల్లి ఐటిఐ కళాశాలలో జరుగుతుందని తెలిపారు. వివరాల కోసం 9618655759ను సంప్రదించాలని సూచించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు మాధవిలత

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో

ప్రతిభ చాటిన పాటూరు విద్యార్థులు

ప్రజాశక్తి-నందలూరు

నెల్లూరు జిల్లా కావలిలో ఈనెల 5న జరిగిన బాల, బాలికల అంతర్ జిల్లా(రాష్ట్రస్థాయి) 3ఎ సైడ్ వాలీబాల్ అసోసియేషన్ అండర్-14 బాల బాలికల పోటీలలో మండలంలోని పాటూరు జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో గెలుపొందారు. విజయం సాధించిన వారికి మెడల్స్ సర్టిఫికెట్స్ అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవిలత, ఉపాధ్యాయులు, పీడీ సుస్మిత, పిఇటి జగన్, క్రీడాకారులను అభినందించారు.

అధిక ధరలకు పండ్లు, పూలు విక్రయాలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

వినాయక చవితి పండుగ సందర్భంగా పండ్లు పూలు కూరగాయలు విపరీతంగా పెరిగాయి. పండ్ల దుకాణంలో అన్ని రకాల పండ్లు రెండేసి వంతున ఒక కవర్లో వేసి మూడు నుంచి నాలుగు వందల రూపాయలకు విక్రయిస్తున్నారు. అలాగే పూలు ధరలు కూడా విపరీతంగా పెంచి 100 గ్రాముల జాజిపూలు 100 రూపాయలతో, రోజాపూలు కిలో మూడు నుంచి నాలుగు వందల రూపాయలు వరకు అమ్ముతున్నారు. కూరగాయల ధరలు కూడా విపరీతంగా పెంచి సామాన్యులకు అందుబాటులో లేకుండా పెంచారు.

మట్టి గణపతి పర్యావరణహితం : ఎమ్మెల్యే

మదనపల్లె : మట్టి గణపతిని అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పోతబోలు మాజీ సర్పంచ్, సేదా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఖాదర్ ఖాన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక బెంగుళూరు బస్టాండ్ లో గల తాజ్ హోటల్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మట్టివిగ్రహాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాజ్ హోటల్ అధినేత మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్ ఖాన్ ఆధ్వర్యంలో వినాయకుని ప్రతిమలు పంపిణీ చేయడంఅభినందనీయం తెలిపారు. కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ అధినేత్రి డాక్టర్ స్వాతి,వమాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, నాయకులు పల్లిపాల రామకృష్ణ ఆచారి, రామిశెట్టి (కమలమ్మ) కృష్ణ, మాజీ జడ్పిటిసి రంగప్ప, రాటకొండ మధుబాబు, ఒంటికొండ వెంకటేష్, సంఘం రమేష్ పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కృష్ణం పల్లిలో విద్యార్థులు అంతా మట్టితో బుజ్జి గణపతులను చేసుకొని రావడం జరిగింది. విద్యార్థుల ప్రధానోపాధ్యాయుడు సి.వి. రమణమూర్తి, ఉపాధ్యాయులు ఎస్.విశ్వనాథ్ అభినందించారు. ప్యూచర్ ఆఫ్ పారిస్ ఉపయోగించిన గణపతి ప్రతిమలను తయారు చేయడం వల్ల పర్యావరణ కాలుష్యం, నీటి కాలుష్యం జరిగి పర్యావరణానికి, ప్రజలకు ఎంతో నష్టాన్ని కలిగిస్తున్నాయని అన్నారు. **రాజంపేట అర్బన్ :** మట్టి గణపతి మన గణపతి అని ప్రముఖ పర్యావరణ పరిరక్షకులు శివాజీ, హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకులు పలుకూరు వెంకటరమణ తెలిపారు. శుక్రవారం ఫ్యూచర్ మైండ్స్ పాఠశాల నందు పర్యావరణ కాలుష్య రహిత మట్టి గణపతి తయారు చేసే కార్యక్రమాన్ని పాఠశాల కరెస్పాండెంట్ నందకిషోర్, ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ పర్యావరణ పరిరక్షకులు శివాజీ, హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు, రిటైర్ డిప్యూటీ తహశీల్దార్ పలుకూరు వెంకట రమణ పాల్గొని విద్యార్థులకు మట్టి, పసుపు తో వినాయక విగ్రహాల తయారీ నేర్పించి, వారు తయారు చేసిన విగ్రహాలను విద్యార్థులకు అందించారు. **కలికిరి:** కలువపల్లికి చెందిన దినకర్ కలికిరి మేజర్ పంచాయితీ పరిధిలో వినాయక చవితిని పురస్కరించుకుని ఉచితంగా వినాయకుని విగ్రహాలు పంపిణీ చేశారు. తన తండ్రి బాబు జ్ఞాపకార్థం ప్రతి ఏడాది కలువపల్లి, కె.రెడ్డివారిపల్లి గ్రామాల్లో ఉచితంగా విగ్రహాలు అందించారు. గురు, శుక్రవారం రెండు రోజులపాటు మూడు లక్షల విలువ చేసే 30 విగ్రహాలు కలికిరి రెడ్డివారిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ నల్లారి లక్ష్మీకరరెడ్డి, మాజీ జెడ్పిటిసి నల్లారి చంద్రకుమార్‌రెడ్డి చేతుల మీదుగా యువకులకు విగ్రహాలు అందించారు. కార్యక్రమంలో గ్రామానాయకులు రమణారెడ్డి, షాహార్, మదన, శ్రీనివాసవర్మ, మేస్త్రి సిద్దప్ప, రెడ్డెప్పరెడ్డి, గుండారెడ్డి, ప్రసాద్, చిన్న మాలపల్లి యువకులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** వినాయక చవితిని పురస్కరించుకుని జనసేన పార్టీ సీనియర్ నాయకులు తోట కళ్యాణ్, మండల అధ్యక్షులు ప్రదీప్ సింగ్ కలిసి మదనపల్లె శాసనసభ్యులు షాజహాన్‌బాషా చేతుల మీదుగా మండలంలోని 11 గ్రామాలకు ఉచితంగా వినాయకుని విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు తోటకళ్యాణ్, మండల అధ్యక్షులు ప్రదీప్ సింగ్, మండల యువత పాల్గొన్నారు. **చిన్నమండెం:** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో జాతీయ సేవా పథకం 1 అండ్ 2 ఆధ్వర్యంలో ముందస్తు వినాయక చవితి సంబరాలు నిర్వహించారు. పర్యావరణ కాలుష్య రహిత వినాయక ప్రతిమలను పూజించడం ద్వారా భక్తి తో పాటు మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుంది. వినాయక ప్రతిమలను నిమజ్జనం చేయడం ద్వారా మట్టిలో ఆష్మజని స్థాయి పెరగడం ద్వారా జలచరజీవులకు, మొక్కలకు, పర్యావరణానికి హాని జరగదని ఎన్ఎస్ఎస్ పిఒ నాగ నవీన్‌కుమార్ విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఘనంగా ముందస్తు వేడుకలు

మదనపల్లి అర్బన్ : భారతీయ ఆచార, సాంప్రదాయాలు ప్రపంచ దేశాలకే ఆదర్శమని మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లె లోని బ్రిలియంట్ హైస్కూల్ కరస్పాండెంట్ మోరంపల్లి సహదేవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణంలో నిర్వహించిన ముందస్తు వినాయక చవితి సంబరాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో అలరించారు. ముందుగా కరస్పాండెంట్ మోరంపల్లి సహదేవ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు మోరంపల్లి రజిత సంస్కృతిని గొప్పతనాన్ని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కలకడ

సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎన్‌వి.కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రకోటపల్లి పిహెచ్‌సి పరిధిలోని దిగువపాలెం గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. పిల్లలకు సీజనల్ వ్యాధుల గురించి వివరించినట్లు తెలిపారు. విష జ్వరాలు , అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం, కిటికీలకు మెష్ కొట్టించుకోవడం, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, తాగు నీరు కాచి చల్లార్చి త్రాగడంవంటి జాగ్రత్తలుపాటించాలని సూచించారు. కిశోబాలికలు రక్తహీనతకు గురికాకుండా ఐరెన్ మాత్రలు అందజేసినట్లు చెప్పారు. బెల్లం చిక్కీలు, గొంగూర, బెల్లంతో చేసిన పిండి వంటలు, దానిమ్మ పళ్ళు, మునగ ఆకు, పాలకూర, పాలు, కోడిగుడ్లు, రాగి జావా, రాగిరోట్టి, సంగటి వంటి ఆహారం, మొలకెత్తు ధాన్యాలుతినాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ జయరామయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పి బి.అశ్విని, ఎఎన్ఎం బి.లక్ష్మి ఆశాకార్యకర్త జి.హైమావతి, డేటా ఎంట్రీ రోజా, ఫైలట్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీధర్‌రావు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వినాయక చవితి వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సిఐ రాజారెడ్డి, తహశీల్దార్ శ్రీధర్ రావు పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వినాయక ఉత్సవ కమిటీతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ స్థాయిలో బి.కొత్తకోటలో నిర్వహించే వినాయక నిమజ్జన ఊరేగింపు ఉత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉత్సవ కమిటీ బాధ్యతగా వ్యవహరించి ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకునేందుకు సహకరించాలని చెప్పారు. వినాయక ఉత్సవ కార్యక్రమాల వీడియో రికార్డింగ్ చేయిస్తామని, ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎవరు గొడవలకు పాల్పడినా నిందితులతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులపై కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారూ ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం సింగల్ విండో పద్ధతిలో ఆన్‌లైన్ ద్వారా అనుమతి తీసుకునే అవకాశం కల్పించిందన్నారు. https://ganeshut-sav.net వెబ్‌సైట్ ద్వారా అనుమతి పొందవచ్చునన్నారు. అదేవిధంగా 7995095800 అనే మొబైల్ నెంబరుకు వాట్సాప్ ద్వారా హాయ్ అని సందేశం పంపి ఎన్‌ఒసి పత్రం పొందవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని గణేష్ ఉత్సవ నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో మండల అన్ని శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్స్ స్కీం వారు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్‌ఒ సోనీ మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్, టీబీ రాకుండా ప్రభుత్వం అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పిస్తుందన్నారు. అవగాహన ద్వారా వీటిని నివారించే అవకాశం ఉంటుందన్నారు. ఐసిటిసి కేంద్రాల్లో హెచ్ఐవి పరీక్షలు చేయించుకునే అవకాశం ఉందన్నారు. సూపర్వైజర్ దర్బార్‌వలి మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ ద్వారా సంక్రమించే లైంగిక వ్యాధులు నివారణలో ఏబిసి ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. కండోమ్ ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో సిఎల్‌డబ్ల్యూ సురేంద్ర, ఏఎన్ఎం హేమలత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కేశవ, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం

జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఫియిజెనీషా

ప్రజాశక్తి - చక్రాయపేట

పేద ప్రజలకు ఉచిత న్యాయ సహాయం చేస్తామని లక్కిరెడ్డిపల్లె మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ చైర్మన్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఫియిజెనీషా పేర్కొన్నారు. శుక్రవారం కే రాజుపల్లె గ్రామంలో రాష్ట్ర లీగల్ సర్వీసెస్ ఆదేశాల మేరకు లీగల్ లీటర్ సి క్యాంపును నిర్వహించారు. ముఖ్య అతిథిగా షేక్ ఫియి జెనీసా, లక్కిరెడ్డిపల్లె బార్ అధ్యక్షులు ఎంఎల్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతినిత్యం చట్టాలతో ప్రతి పౌరుడు జీవించాల్సి ఉంటుందన్నారు. పేద ప్రజలకు, విభిన్నప్రతిభావంతులు, మతిస్థిమితం లేని వారికి ఉచిత న్యాయ సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వెంకటరెడ్డి, ఏఐఎస్‌ఐ శేషురావు, రిటైర్ న్యాయవాది చెన్నకృష్ణయ్య,పాల్గొన్నారు.

పత్తి పంటలో క్షేత్ర పరిశీలన

ఎర్రగుంట్ల : మండలంలోని పెద్దనపాడు గ్రామంలో వ్యవసాయ శాఖ, కడప కెవికె సంయుక్తంగా పత్తి పంటలో క్షేత్ర పరిశీలన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా వ్యవసాయశాఖ-జిల్లా వనరుల కేంద్రం అధికారి శైలజ మాట్లాడుతూ పత్తి పంటలో రసం పీల్చు పురుగుల నియంత్రణకు పలు సూచనలు చేశారు. కమలాపురం వ్యవసాయశాఖ సహాయ సంచా లకులు ఎవి నరసింహారెడ్డి మాట్లాడుతూ శనగ పంట సాగు చేసే రైతులు ఒక కిలో విత్తనానికి అయిదు మిల్లిగ్రాముల టేబుకొనోజోల్ కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సతీష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రకృతి వ్యవసాయం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని బడుగువారిపల్లె గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన ప్రత్తి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ప్రకృతిలో సహజంగా లభించే సహజ సిద్ధమైన ఎరువులతో పంటలు సాగు చేసినట్లు తెలిపారు. పత్తిలో మిశ్రమ పంటలుగా కంది, అలసంద, ఆముదం, మటిక, గోరు చిక్కుడు, మొక్కజొన్న వంటి పంటలు ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసినట్లు చెప్పారు. క్రిమి సంహారక మందులు వాడకుండా ద్రవ జీవామృతం తయారు చేసి పొలానికి పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆర్.రామసుధ, రమణయ్య, ముని భూపాలుడు, రైతులు పాల్గొన్నారు.

15లోపు ఇకెవైసి చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులు సమీప రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు చేసుకొని ఈనెల 15లోగా ఇకెవైసి కూడా పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు వరి పంటను సాగు చేపడుతున్నారన్నారు. ఇప్పటివరకు 4వేల ఎకరాలలో వరి పంట సాగు చేసినట్లు రైతులు పంట నమోదు చేసుకున్నారన్నారు. మండల పరిధిలో 15వేల ఎకరాలలో వరి పంట సాగయ్యే అవకాశం కనిపిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలు, ఎరువులు అందాలంటే ఈ కెవైసి తప్పనిసరి అన్నారు. కావున రైతులు పంట సాగు చేయగానే వ్యవసాయ సిబ్బంది వద్ద నమోదు చేసుకోవాలన్నారు. రైతు సేవకేంద్రాల్లో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు పొందాలని ఎఒ సూచించారు.

వేంపల్లెలో పిచ్చి కుక్క సైర్వ విహారం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో పిచ్చికుక్క సైర్వ విహారం చేస్తూ ఆరుగురిని గాయపరిచింది. శుక్రవారం వేంపల్లెలో హనుమాన్ జంక్షన్, రాయచోటి బైపాస్, ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న వారిపై పిచ్చికుక్క దాడి చేయడంతో జమాల్ వలి, థామస్ వెంకటసుబ్బయ్య, గోపాల్‌రెడ్డితోపాటు పలువురికి రక్త గాయాలయ్యాయి. పిచ్చి కుక్క కరవడంతో బాధితులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకున్నారు. ఆయా ప్రాంతాల్లో వెళ్లే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సైర్వ విహారం చేస్తున్న పిచ్చి కుక్కను పట్టి, తమను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. రాయచోటి బైపాస్, ఎన్టీఆర్ సర్కిల్, హనుమాన్ సర్కిల్‌లో పిచ్చికుక్క ఎక్కువగా తిరుగుతోందని హడలిపోతున్నారు. కుక్కలు వెంబడించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్ననట్లు పలువురు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు దృష్టిసారించి వేంపల్లెలో ఎక్కువగా ఉన్న కుక్కలు పట్టి వేరే అడవి ప్రాంతాల్లో వదలాలని ప్రజలు కోరుతున్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కోర్టు కడప

M.V.O.P. No.429/2022

1.మూడే సుజాత మరియు ఇతరులు.

...పిటిషనరు

V/s

1.మూడే శ్రీను నాయక్, S/o బాలాజీ నాయక్, R.10., 1/32, తిప్పాయపల్లి (V),పుల్లంపేట(M),అన్నమయ్య జిల్లా.

...రెస్పాండెంట్ నెం.3

SUMMONS TO R3 U/O 5 R1 AND 5 OF CPC

పై తెలిపిన 1వ పిటిషనర్ భర్త రోడ్డు ప్రమాదంలో మరణించినందుకుగాను మూడవ ప్రతివాది అయిన నీ మీద మరియు 1, 2 ప్రతివాదుల మీద నష్ట పరిహారము కోరి మీపై కేసు దాఖలు చేసియున్నారు. 3 వ ప్రతివాది ఐన మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టులో మీరు స్వయంగా గానీ, లేక వకీలు ద్వారా గానీ 24-09-2024 వ తేదీన ఉదయం 10:30 గంటలకు హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల ఈ కేసును మీ పరోక్షమున తీర్మానించబడును.

//By order of the court//

K. కృష్ణయ్య,
అడ్వకేట్, కడప,
మొబైల్ : 94409 94702.

మహారాజశ్రీ రాజంపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సీనియర్ (సీనియర్ డివిజన్) కోర్టులో

H.M.O.P. NO :16/2024

కందుల పార్వతి W/o కందుల సాంబశివరాజ, గృహిణి, K.కందులవారిపల్లి(V)&(P),చిట్వేలి(M),అన్నమయ్య జిల్లా.

...వాది

V/s

కందుల సాంబశివరాజ, K.కందుల వారి పల్లి (V) & (P), చిట్వేలి (M), అన్నమయ్య జిల్లా.

...ప్రతివాది

ఇందుమూలంగా తెలియజేయడం ఏమనగా వాది కందుల పార్వతి, ప్రతివాది అయిన మీపై పై కనిన కోర్టులో విడాకుల నిమిత్తం పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు విషయమై రాజశ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు ప్రతివాది అయిన మీకు నోటీసులు జారీ చేయడం అయినది. సదరు విషయమై మీకు ఏవైనా ఆక్షేపణలు ఉన్న యెడల మీరు నేరుగా గాని లేదా మీ వకీలు ద్వారా గాని 24-09-2024న ఉదయం 10:30 గంటలకు పైకోర్టు నందు హాజరై మనవి చేసుకొనవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడం అయినది.

R. మల్లిఖార్జున,
వాదిపరం, అడ్వకేట్,
రాజంపేట.

మహారాజ గోపురం ప్రారంభంలో పాల్గొన్న మంత్రి

శ్రీరామేశ్వరాలయంలో మహారాజ గోపురం ప్రారంభం

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గేటు వద్ద ఉన్న శ్రీ రామేశ్వర ఆలయంలో మహారాజ గోపురం ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, క్రీడా, యువజనశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో మెలగాలంటే ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలని అన్నారు. ఐకమత్యం, ప్రేమ ద్వారా ఇవి సఫలమవుతావని పేర్కొన్నారు. రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం కొండ్రెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి, బద్వేలు టిడిపి ఇన్‌ఛార్జి రితీష్‌కుమార్‌రెడ్డి, మాజీ లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కేడెం. లక్ష్మయ్య కసిరెడ్డి, వెంకటశివారెడ్డి, మోడం చెన్నయ్య, సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ మేనేజర్ ఆరిఫ్

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని స్వయం ఉపాధి సంఘ సభ్యులు కెనరా బ్యాంక్ అందిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ మేనేజర్, స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్ బాలరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సమైక్యభవనంలో వివోఏల సమావేశంలో వారు మాట్లాడుతూ శిక్షణ సమయంలో క్రమశిక్షణ, శ్రద్ధ, సత్ప్రవర్తనతో మెలగాలని పేర్కొన్నారు. 18 సంవత్సరముల నుంచి 45 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతను గుర్తించి చైతన్యవంతులను చేయుట వ్యాపార దక్షతలో శిక్షణ, సలహాలు ఇచ్చి స్వయం ఉపాధి కల్పించబడుతుందని అన్నారు. శిక్షణలో వసతి, భోజనం, కోర్స్ మెటీరియల్ ఉచితంగా అందివ్వబడుతుందని తెలిపారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా వసతి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిక్షణ ముగిసిన తర్వాత రెండు సంవత్సరాల పాటు అభ్యర్థి కార్యక్రమాలను గమనిస్తూ స్వయం ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఉచిత శిక్షణ ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపిఎం సుబ్బా లక్ష్మమ్మ, సిసిలు వెంకటసుబ్బయ్య, రుద్రాచారి, వెలుగు సిబ్బంది, వివోఏలు పాల్గొన్నారు.

ఇసుకను సక్రమంగా అందించాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఉచిత ఇసుక ను వినియోగదారులకు సక్రమంగా అందజేయాలని టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక లేక ఇక్కట్లు పడుతున్న తరుణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కూలీలను ఆదుకోవాలని ఉద్దేశంతో ఇసుకను ఉచితంగా అందజేసే విధానాన్ని రూపొందించారని అన్నారు. రాజంపేట డివిజన్ పరిధిలోని బాలరాజుపల్లిలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి ఇసుక ప్లాంటును ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ప్రతికూలికి పని దక్కాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైల్వే కోడూరుకు బాలరాజుపల్లి ప్లాంట్ ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో రైల్వే కోడూరుకు చెందిన కస్తూరి దినేష్, మందపాటి శంకరయ్య, చిగురుపాటి శంకరతో పాటు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సిడిపిఒ రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో భర్తీ చేయనున్నామని తెలిపారు. ఇందిరానగర్‌లో అంగన్వాడీ కార్యకర్త పోస్టుకు బిసి, ఎఆర్ఎన్‌వై కాలనీలో మినీ అంగన్వాడీ కార్యర్తలకు ఎస్‌టి, అంగడి వీధిలో ఆయా పోస్టుకు బిసి, తురకపల్లె అంగన్వాడీ సహాయకురాలు పోస్టుకు బిసి మహిళలు అర్హులన్నారు.

క్రైం కార్నర్

స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, కారుతో అటవీశాఖ సిబ్బంది

5 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సానిపాయి రేంజ్ పరిధిలోని క్వారీ పాయింట్ దగ్గర కారులో ఎర్రచందనం దుంగలు తరలు తుండగా వెంబడి కారును, ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసున్నామని, ఇద్దరు స్మగ్లర్లు పరారైనట్లు సానిపాయి రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శేషాచలం అడవుల నుంచి అక్రమంగా ఎర్రచందనం దుంగలు నరికి రవాణా చేస్తున్నారన్న సమాచారంతో ఆప్రాంతంలో తనిఖీలు ముమ్మరం చేశామని చెప్పారు. వీరబల్లి క్వారీ పాయింట్ దగ్గర ఎర్రచందనం రవాణా చేస్తుండడంతో సిబ్బందితో దాడి చేశామని స్మగ్లర్లు పరారయ్యారని, కారును స్వాధీనం చేసుకుని అందులో ఉన్న రెండు లక్షలు విలువ చేసే ఐదు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొని కారును సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేసి నిందితులను పట్టుకుంటామని తెలిపారు. ఈ దాడుల్లో సానిపాయి ఎఫ్ఎస్ఒ రజని, ఎఫ్‌బిఒ అనిల్ కుమార్, సాని పాయి ఎఫ్‌బిఒ లీలా శ్రీహరి, దిన్నెల ఎఫ్‌బిఒ యం.సునీర్ బాషా, బేస్ క్యాంపు, స్ట్రైక్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని గువ్వల చెరువు ఘాట్‌లో ఉన్న శివాలయం వద్ద శుక్రవారం స్కూటర్ కారు ఢీకొని రెడ్డి పీర్ 24అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. గువ్వలచెరువు చెందిన రెడ్డి పీర్ సాయంత్రం స్కూటీలో ఘాట్‌పైకి వెళుతుండగా శివాలయం వద్దకు రాగానే కడప వైపు నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో స్కూటీ పై వెళుతున్న రెడ్డి పీర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కారు డ్రైవర్ పరారయ్యాడని, సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.